రాజా పార్టీయే అక్కడ కాంగ్రెస్. కాగా కాంగ్రెస్ అభ్యర్థి రాజా పార్టీనుండి వోట్లు చీల్చి తెచ్చుకోవాలన్నమాట. మరి కమ్యూనిస్టు పార్టీకి వేసే వోటర్లు పార్టీ అభ్యర్థికి నూటికి నూరుపాళ్ళు వేస్తారు. రిజర్వు సీటుకు మాజీమంత్రి శ్రీ వేముల కూర్మయ్య, శ్రీ గుంటూరు బాపనయ్య (క. పార్టీ తరఫున) పోటీ చేస్తున్నారు. మాజీ మంత్రివర్యుల విజయం సంగతి సందేహాస్పదంగా వుంది.

కాగా పోగా కాంగ్రెసుకు కృష్ణాజిల్లాలో ఖాయంగా వచ్చే సీట్లు: తిరువూరు, బందరు (పార్లమెంటు, అసెంబ్లీ) నూజవీడు.

---

స్కెచ్

# నీటి మాటలు

సూరపనేని చంద్రశేఖరరావు

శాంతమ్మ పెరట్లోంచి "గోపీ!" అని కేక పెట్టింది. గోపి గదిలో గోళీలు, బలపాలు, పుస్తకాలు మొదలైన సరంజామా క్రొత్తకాపురానికి వచ్చిన కోడలు మాదిరిగా సర్దుతున్నాడు. 'గోపి గోపి' అని గాల్లో పొర్లగచింది. గోపి చెవిని దూరింది కాని, విననట్లుగనే తన పనిలో నిమగ్నుడయినాడు. విసిగి గది గుమ్మం కడకు వచ్చి 'ఏరా ఎన్ని కేకలు వేసినా వినపడదా' అంది. అతడు చిరునవ్వుతోనే తల్లి ననునయిస్తూ 'వస్తున్నానమ్మా' అన్నాడు.

"నిన్నే రోజుకారోజు పోరుపెట్టి బడికి పంపవలసిందేగా."

"ఇంకా ఎవరూ వెళ్ళటం లేదమ్మా! మరి నువ్వు అన్నం పెట్టటానికి పనిమీదుంటివామొ."

"ఏదో ఒకటి కుంటిసాకు. రా అన్నం పెడ్తా."

"నేను మళ్ళీ వచ్చినాక తింటానమ్మా. ఇప్పుడు వద్దు."

"ఏపూట నాయనా మనకు మారాము లేంది. రా బాబు రెండుముద్దలు తినిపిస్తా."

"నాకు వద్దు."

"అబ్బ! రారా. వచ్చేటప్పటికి చాల ప్రొద్దెక్కుతుంది."

"మీగడ వేస్తే తింటా."

"వేస్తాలే రారా."

"ఎవడు తింటాడేమిటి వట్టి పచ్చడితో."

"విసిగించక రా. నీవు వచ్చేసరికి బంగాళదుంపలు వండుతాగా."

"సరే పద."

శాంతమ్మ గోపి తలదువ్వుతూ "రోజూ మారాము చెయ్యకూడదు బాబూ. చక్కగా ప్రొద్దున్నే లేచి బళ్ళోకి వెళ్ళాలి" అని బుజ్జగించింది.

"నే నీపూట బడికి వెళ్ళనమ్మా"

"మళ్ళా ఏమిటిరా"

"నాకు కొత్త బూడ్సులు లేవు."

"నాన్న రేపు తెస్తారుగాని, యీ పూటకు వెళ్లు బాబూ."

"ఎప్పటి కప్పుడిలాగే చెపుతావ్."

"కాదు నాయనా నామాట నమ్ము. తప్పకుండా తెప్పిస్తాగా."

"సరే యేమైనా పెట్టు."

"ఇప్పుడు రెండుబిళ్ళలు తీసుకొని వెళ్ళిరా. నీవు వచ్చేసరికి లడ్డూలు చేస్తాగా. చెప్పినమాట విను."

"ఊహుం. నాకేమీ వద్దులే."

"మా బాబుగా."

"వెళ్తున్నా లేమ్మా."

* * *

పదిన్నరయింది. కృష్ణమూర్తి తన గదిలో కూర్చొని చకచక సర్దుతున్నాడు. ఆఫీసు వేళ కావటం చేత తొందర, చికాకు ముఖంలో కన్పిస్తున్నవి. "సుశీ! ఇంకా వంటకాలేదా" అని భార్యను పిలిచాడు. అయింది రమ్మనుటతోనే, వంట గదిలోకిపోయి పీటవాల్చి కూర్చున్నాడు.

అన్నం వడ్డిస్తూనే సుశీల "విధవ ఉద్యోగము విధవలోకము, మనిషికి ఒకక్షణమైన విశ్రాంతి వుండదు కదా" అన్నది.

"మరిన స్నేం చేయమంటావు"

"ఇంకేదైనా ఒకటి చూచుకో కూడదా"

"ఈ రోజుల్లో ఉన్న దివదళి, ఇంకో దానికి ప్రోత్సహించటమంత తెలివితక్కువ యింకొకటి ఉంటుందా?"

"పగలస్తమానూ ఒంటరిగా వుండబోతే తోచదు సరిగదా భయంగా వుంటుంది"

"ఎప్పుడు వీలైతే అప్పుడే వస్తూంటిని కదా"

"ఏమి రావటమో. ఎప్పుడూ పొద్దుపోయిన తరవాతనే గదా."

"పెందరాళే వస్తానులే సుశీ!"

"మన ఇంటిప్రక్కశారద, కొత్తసిల్కు చీరకొన్నది యెంత చక్కగా వున్నదను కున్నారు."

"ఇంతకు మన ఉపోద్ఘాతము ఒకటి కావలెనా"

"ఊఁ పోదురు"

"మీజాతి తిన్నగా చెప్పదుగా. జీతము వచ్చినాక తెస్తానులే"

"మీయిష్టం. సరేగాని మొన్న నేసినిమాకు తీసుకొని వెళ్తానన్నారు కదూ"

"ఎక్కడ తీరందే. రేపు వెళ్దాంలే." అని చెయ్యి కడిగి ప్రయాణమయినాడు. సుశీలభర్తను గడపదాకా పంపించి, అక్కడే నుంచుని, వెనకాల చూస్తూన్నది.

* * *

స్టేజంతా పెట్రోమాక్సు లైట్లతో, దేదీప్యమానముగా వెలుగుతున్నది. మహానాయకుడు, మహాసేవకుడు యేమి సందేశమిస్తాడో విందామని, జనము తండోపతండాలుగా సభా ప్రదేశాన్ని అలంకరించారు. కొందరు నాయకుని అలంకరింపడానికి పూలమాలతో వున్నారు. ఇంతలో సభాధ్యక్షుడు. అధ్యక్షపీఠము తీసుకొని, మహానాయకుని ఉపన్యసించమని అర్థించాడు. అంత మహానాయకుడు, కరతాళధ్వనుల మధ్య లేచి, వేదిక నెక్కి ఉపన్యాస మారంభించాడు

"సోదర సోదరీ మణులారా! మీరు నా కొసగిన గౌరవమునకు కృతజ్ఞుడను. మీరు రేపు ఎన్నికలలో కూడ నన్నిట్లే గౌరవింతురని తలంచెదను. ఎన్నికలు సమీపించుచున్నవి. భారత దేశపు భావిస్థితి యావత్తు, మీయొక్క అమూల్యమైన వోటుమీద నాధారపడి యున్నది. దానిని మీరు సద్వినియోగము చేసిననే, మంచి ఫలితములు మీరు పొందగల్గుతారు. నేడు ఎక్కడ చూచినా నిరాశ నిస్పృహ తాండవించుచున్నవి. వీటన్నికి కారణములు, మా పార్టీ తీవ్రంగా నాలోచించి. తగిన ప్రణాళికలు సిద్ధపరచినది. అవి వివరించెదను.

"మా పార్టీ సిద్ధపరచినన్ని ప్రణాళికలు ఇక యే యితర పార్టీ తయారుచేయలేదు. మేమే గనక ఎన్నికలలో వచ్చిన ఇప్పుడున్న తిండి, గుడ్డకరువు మొట్టమొదట్లోనే త్రుంచివేస్తాము. మా పంచవర్ష ప్రణాళిక ప్రకారం, దేశ మిక అయిదు వర్షములలో స్వయం సమృద్ధ మవుతుంది. తరువాత దశవర్ష ప్రణాళికతో, మన దేశ మగ్ర రాజ్యాలలో నొకటవుతుంది. దున్నేవానికే భూమి, కష్టపడేవానికే తిండి అని మా పార్టీ మీకు హామీ నిస్తున్నది." అని చెప్పుచుండగా సభలో నొక గొంతు "వోటు నిచ్చువరకే ఈ హామీలు" అని, మరియొకటి "గెలిచేవరకే ఈ వాగ్దానాలని" కేకలు వినిపించగనే, మహానాయకుడు "మీరనుకొన్నట్లు కాదు. మీరొకసారి గెలిపించి చూడండి. చెప్పినట్లు చేస్తాం. చెయ్యకున్న మమ్ము దింపివేయండి. చేస్తే మాపార్టీ యే యేమైన చెయ్యాలి. ఇంకొక పార్టీ వస్తే యీ మాత్రమైనా వుండదని నొక్కవక్కాణించగలను. కనుక మీరు ఆలోచించి మా పార్టీకే వోటు వేసెదరని నమ్ముతూ విరమించుచున్నాను."

మన పార్టీకి జై!

మన నాయకుడు జిందాబాద్!

దేశభక్తి అంటే చాలా అల్పమైన కారణాలకి ప్రాణం ఇచ్చెయ్యడానికిగాని, లేదా యింకొకరి ప్రాణం తీసెయ్యడానికిగాని సిద్ధంగా ఉండడం—బెర్ట్రాండ్ రసెల్.